సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం । 14 । అక్టోబర్ । 2022

చీకుధార జలపాతానికి పర్యాటకుల తాకిడి



రాజవొమ్మంగి: మండలంలోని అమ్మిరేఖల గ్రామశివారు రక్షిత అటవీప్రాంతంలో గల చీకుధార జలపాతం వద్ద గురువారం పర్యాటకులు సందడి చేశారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఈ జలపాతం పరవళ్లు తొక్కుతోంది. చుట్టూ ఎత్తైన పర్వతాలు, పెద్ద పెద్ద బండరాళ్లు, చెట్లు, రకరకాల పొదలతో ఆహ్లాదకరంగా ఉన్న ఈ ప్రాంతాన్ని సందర్శించేందుకు పర్యాటకులు భారీ సంఖ్యలో వస్తున్నారు. ఇక్కడ ధారమల్లేశ్వరస్వామివారిని భక్తి శ్రద్ధలతో పూజించి, ప్రకృతి సోయగాలను ఆస్వాదిస్తున్నారు.

కోర్టు కేసుల విచారణ 4వ తేదీకి వాయిదా

సాక్షి,పాడేరు: స్థానికంగా పలు కోర్టుల్లో ఈ నెల 14న నిర్వహించవలసిన విచారణ వాయిదా పడినట్టు ఇన్‌చార్జి ఐటీడీఏ పీవో, పాడేరు సబ్‌కలెక్టర్ వి.అభిషేక్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 4వ తేదీన కోర్టు కేసుల విచారణ జరుగుతుందని,కక్షిదారులు ఈవిషయాన్ని గ్రహించాలని ఆయన కోరారు.

న్యూస్‌రీల్

వారంలోగా పరిహారం

• పాడేరు సబ్‌కలెక్టర్ అభిషేక్



రైతుల సమక్షంలో సర్వేటీమ్‌తో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ అభిషేక్

కొయ్యూరు: జాతీయ రహదారి 516/ఈ నిర్మాణంలో భూములను కోల్పోతున్న రైతుల ఖాతాల్లోకి వారం రోజులలోగా పరిహారం నిధులు జమకానున్నట్టు పాడేరు సబ్ కలెక్టర్ అభిషేక్ వెల్లడించారు. మండలంలోని రావణాపల్లి, వలసంపేట, నల్లగొండ, రామరాజుపాలెం, పెదమాకవరం,నడింపాలెం గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే ముగిసిందని, రైతులు కోల్పోతున్న భూముల వివరాల నమోదు పూర్తయిందని చెప్పారు. అర్హులందరికీ పరిహారం అందుతుందని తెలిపారు. ఇళ్లు కోల్పోతున్న వారికి కూడా పరిహారం వస్తుందని చెప్పారు. గిరిజనేతరుల ఇళ్లకు కూడా పరిహారం అందే అవకాశం ఉందన్నారు. భీమవరం సమీపంలో కొందరు గిరిజనేతరులు భూములను సాగు చేస్తున్నారని, వారి సమస్యను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. రైతులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పారు. సబ్‌కలెక్టర్ వెంట డీటీ సీతారాములు తదితరులున్నారు.

మారేడుమిల్లిలో 21 మెగా జాబ్‌మేళా

రంపచోడవరం: మారేడుమిల్లి వైటీసీలో ఈ నెల 21న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు కలెక్టర్ సుమిత్ కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈమేళా నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. 915 మందికి 15 సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు నిర్వహిస్తున్న ఈ మేళాలో పాల్గొనేందుకు పది, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, ఇంజినీరింగ్ పాసైన అభ్యర్థుల అర్హులని తెలిపారు. తమ పేర్లను ఏపీఎస్ఎస్‌డీసీ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు రూ.7 వేల నుంచి రూ.40 వేల వరకు జీతం లభిస్తుందని తెలిపారు. వివరాలకు 9988853335 అనే ఫోన్ నంబరులో సంప్రదించాలని పేర్కొన్నారు.


దట్టమైన అడవిలో గర్భిణి ప్రసవం



డోలీలో గర్భిణిని తరలిస్తున్న కుటుంబ సభ్యులు

జి.మాడుగుల: మండలంలో గడుతూరు పంచాయతీ నిట్టమామిడి గ్రామానికి చెందిన గర్భిణిని డోలీలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో దట్టమైన అడవిలో ప్రసవించింది. నిట్టమామిడికి చెందిన కొర్రా రాధ నిండు గర్భిణి. గురువారం పురిటి నొప్పులు వచ్చాయి. ఆ గ్రామానికి రోడ్డు సదుపాయం లేకపోవడంతో కుటుంబ సభ్యులు డోలీమోతతో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో దట్టమైన అటవీ ప్రాంతంలో ప్రసవించింది. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారు. అనంతరం రోడ్డు పాయింట్ నుంచి ప్రైవేట్ వాహనంలో వారిని పాడేరు ఆస్పత్రికి తరలించారు.

వన్‌ధన్ వికాస కేంద్రాల అభివృద్ధికి చర్యలు



మాట్లాడుతున్న పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం: స్థానిక ఐటీడీఏ పరిధిలోని వన్‌ధన్ వికాస కేంద్రాలను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే తెలిపారు. ఐటీడీఏ సమావేశం హాలులో గురువారం ఏపీడీ వెలుగు, జీసీసీ మేనేజర్, డీపీఎంలు, ఏపీఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఏజెన్సీ ఏడు మండలాల్లో 110 వన్‌ధన్ వికాస కేంద్రాలున్నట్టు తెలిపారు. ఒక్కో కేంద్రానికి 300 మంది సభ్యులు ఉంటారని చెప్పారు. ప్రస్తుతానికి 29 కేంద్రాలకు రూ.1.60 కోట్లు మంజూరు చేసినట్టు తెలిపారు. వన్‌ధన్ వికాస కేంద్రాల సభ్యులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలని తెలిపారు. వికాస కేంద్రాలకు షెడ్లు లేకపోతే అద్దెకు తీసుకోవాలని సూచించారు. పీవో పీహెచ్ శ్రీనివాస్‌రావు, వెలుగు ఏపీడీ ఎ.శ్రీనివాసరావు, డీపీఎంలు పరమేశ్వరరావు, జీసీసీ మేనేజర్ పార్వతీశం, అపర్ణ పాల్గొన్నారు.

మాతాశిశు పోషణకు

టెక్నాలజీ దన్ను

• జిల్లాలో అన్ని అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లకు సెల్ ఫోన్లు పంపిణీ
• యాప్‌లో చిన్నారుల, గర్భిణుల హాజరు నమోదు
• ఐసీడీఎస్, వైద్య ఆరోగ్యశాఖల మధ్య సమన్వయం



అంగన్‌వాడీ టీచర్‌కు సెల్‌ఫోన్ అందజేస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

రంపచోడవరం: అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసి, అక్కడకు వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించేందుకు ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టింది. ప్రతీ రోజూ ఎంత మంది చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్నారు, ఎంత మంది గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నారు వంటి వివరాలు నమోదు చేసేందుకు ప్రతీ అంగన్‌వాడీ టీచర్‌కు సెల్‌ఫోన్ అందజేశారు. ప్రభుత్వం నిర్దేశించిన యాప్‌లో అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారులు, బాలింతలు, గర్భిణుల హాజరును నమోదు చేయాలి. నెట్‌వర్క్ లేనివారు ఆఫ్‌లైన్‌లో వివరాలు నమోదు చేసి నెట్‌వర్క్ ఉన్న ప్రాంతంలో యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. దీంతో అంగన్‌వాడీ కార్యకలాపాలను మాతాశిశు సంరక్షణ శాఖ కింది స్థాయి సిబ్బంది నుంచి ఉన్నతాధికారుల వరకు పర్యవేక్షించవచ్చు. అంగన్‌వాడీ కేంద్రాలకు సెల్ ఫోన్లు పంపిణీ చేయడం వల్ల ప్రధానంగా ఐసీడీఎస్, వైద్య ఆరోగ్య శాఖల మధ్య సమన్వయం ఏర్పడుతుంది. వైద్య ఆరోగ్య శాఖ క్షేత్రస్థాయి సిబ్బంది గ్రామస్థాయిలో హైరిస్క్ గర్భిణుల వివరాలను ఆర్ఎస్ఎం యాప్‌లో నమోదు చేస్తారు. దీని వల్ల అంగన్‌వాడీ కేంద్రాల్లోని టీచర్లు వారి వివరాలు తెలుసుకుని, వారికి ప్రత్యేకంగా పౌష్టికాహారం అందించే అవకాశం ఏర్పడుతుంది.

3,214 సెల్ ఫోన్లు పంపిణీ

జిల్లాలో 1,791 ప్రధాన, 1,423 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 3-5 సంవత్సరాల పిల్లలు 47,737 మంది ఉన్నారు. 3,214 అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న టీచర్లకు ప్రభుత్వం సెల్‌ఫోన్లు అందజేసింది. అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న చిన్నారుల హాజరు వీటి ద్వారా నమోదు చేస్తున్నారు. దీని వల్ల అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల హాజరు నమోదు శాతం తక్కువగా ఉంటే, మెరుగుపర్చేందుకు అవకాశం ఉంటుంది. ఎప్పుడో అంగన్‌వాడీ కేంద్రాన్ని విజిట్ చేసినప్పుడు కాకుండా ప్రతీ రోజూ పూర్తిస్థాయి పర్యవేక్షణకు అవకాశం ఉంటుంది.

సమర్థంగా సేవలు



అంగన్‌వాడీ టీచర్లకు అందజేసిన సెల్‌ఫోన్ ద్వారా యాప్‌లో హాజరు నమోదు చేయాలి. ఇలా నమోదు చేయడం వల్ల ఎప్పటికప్పుడు పూర్తి స్థాయి పర్యవేక్షణకు అవకాశం ఉంటుంది. వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ పథకం మరింత పక్కాగా అమలు జరుగుతుంది. ఈ యాప్ కారణంగా గతంలో కంటే మెరుగ్గా పోషకారం, పూర్తిస్థాయిలో సేవలు అందిస్తున్నాం.

– సూర్యలక్ష్మి, ఐసీడీఎస్, పీడీ పాడేరు

అగ్రి టూరిజంతో గిరిజనులకు మేలు

• రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి



పరిశోధన కేంద్రంలో ఔషధ మొక్కలను పరిశీలిస్తున్న రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి ఎంపీ, ఎమ్మెల్యేలు

చింతపల్లి/చింతపల్లిరూరల్ : అగ్రి టూరిజంతో గిరిజనులకు మేలు జరుగుతుందని రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి తెలిపారు. స్థానిక వ్యవసాయ పరిశోధన స్థానాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఇక్కడ సాగు చేస్తున్న వివిధ పంటలు, శాస్త్రవేత్తలు రైతులకు అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లంబసింగికి అధిక సంఖ్యలో వస్తున్న పర్యాటకులను ఆకట్టుకునేలా అగ్రి టూరిజం ప్రాజెక్టును అభివృద్ధి చేయాలని సూచించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఇక్కడ వివిధ రకాల పూలసాగుకు వాతావరణం అనుకూలంగా ఉందన్నారు. మన్యంలో సేంద్రియ వ్యవసాయానికి అనువైన వాతావరణం ఉన్నందున గిరిజనులు ముందుకు రావాలని ఆయన కోరారు. రాష్ట్రంలో వ్యవసాయ అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని చెప్పారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు ప్రభుత్వం రూ.83 వేల కోట్లు కేటాయించిందని ఆయన తెలిపారు. రైతు భరోసా కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేస్తున్న ప్రభుత్వం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. రైతులకు భరోసా పథకం కింద రూ. 25 వేల కోట్లు మంజూరు చేసిందని చెప్పారు. ప్రపంచమే ఏపీ వైపు చూసేలా పరిపాలన కొనసాగుతుండడంతో ప్రతి పక్షాలకు నిద్రపట్టడం లేదని తెలిపారు. మన్యంలో కాఫీ సాగును ఉపాధి హామీ పథకంతో అనుసంధానం చేసేలా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతానని చెప్పారు. పసుపు సాగుకు ఇక్కడ అనువైన వాతావరణం ఉండడంతో ఐటీడీఏ తగిన ప్రోత్సాహం అందిస్తోందని తెలిపారు. చట్ట వ్యతిరేక పంటలను సాగు చేసి జీవితాలను పాడుచేసుకోవద్దని ఆయన గిరిజనులకు సూచించారు. సిరుల పంటగా చెప్పుకునే రాజ్‌చిక్కుళ్లసాగుకు 90 శాతం రాయితీపై ప్రభుత్వం విత్తనాలు పంపిణీ చేస్తోందన్నారు. వీటిని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఎకో పల్పింగ్ యూనిట్‌ను సందర్శించారు. కాఫీ పండ్ల కొనుగోలు లక్ష్యాలను మరింత పెంచాలన్నారు. కనీసం నాలుగు వేల టన్నులు కొనుగోలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ గొడ్డేటి మాధవి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, జీసీసీ చైర్‌పర్సన్ స్వాతిరాణి, ఏడీఆర్ సురేష్ కుమార్, ఎంపీపీ కోరాబు అనూషాదేవి, జెడ్పీటీసీ బాలయ్య, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షురాలు దురియా పుష్పలత, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మోరి రవి, ఎంపీటీసీలు దారలక్ష్మి, విజయలక్ష్మి, కాఫీ మాక్స్ సొసైటీ అధ్యక్షుడు సెగ్గె కొండలరావు, సభ్యులు విష్ణుమూర్తి,మామిడి గోవిందరావు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో పర్యటన

చింతపల్లి రూరల్: మండలంలోని చౌడుపల్లి, చిన్న గెడ్డ, గొందిపాకలు గ్రామాల్లో గురువారం రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ నాగిరెడ్డి, ఎంపీ మాధవి,ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పర్యటించారు. ఈ ప్రాంతంలో గిరిజనులు సాగు చేస్తున్న పంటలు, దిగుబడులు, వస్తున్న ఆదాయం తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్ట్రాబెర్రీ, కాఫీలో అంతర పంటగా మిరియాలను సాగు చేస్తున్నారని అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో జీసీసీ చైర్‌పర్సన్ స్వాతిరాణి, అగ్రికల్చర్ జిల్లా చైర్‌పర్సన్ ఎం.సర్వస్వతి, ఏడీఆర్ సురేష్ కుమార్, ఎంపీపీ అనూషా దేవి, జెడ్పీటీసీ బాలయ్య, మండల పార్టీ అధ్యక్షుడు మోరి రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రభంజనంలా గర్జన



పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఉమ్మడి విశాఖ జిల్లా రీజనల్ కోఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వై.వి సుబ్బారెడ్డి. చిత్రంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, మేయర్ గొలగాని హరివెంకట కుమారి తదితరులు

• ఉత్తరాంధ్రపై విషం చిమ్మే వారికి విశాఖ గర్జన సమాధానం కావాలి
• రైతుల ముసుగులో చేపడుతున్న అమరావతి పాదయాత్ర వెనుదిరగాలి
• పార్టీలకతీతంగా ఆరు జిల్లాల ప్రజలు శాంతియుతంగా నిరసనలో పాల్గొనండి
• గర్జన నిర్వహిస్తున్న నాన్ పొలిటికల్ జేఏసీకి పార్టీ పూర్తి మద్దతు
• వైఎస్సార్ సీపీ ఉమ్మడి విశాఖ జిల్లా రీజనల్ కోఆర్డినేటర్ వై.వి. సుబ్బారెడ్డి

సాక్షి, విశాఖపట్నం: ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజలకు ఈ ప్రాంతంపై సెంటిమెంట్ లేదని వ్యాఖ్యానించే ప్రతి ఒక్కరికీ విశాఖ గర్జన సమాధానం కావాలని.. ఈ ప్రాంత ప్రజలంతా ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్, వైఎస్సార్ సీపీ ఉమ్మడి విశాఖ జిల్లా రీజనల్ కో- ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. ఉత్తరాంధ్ర ప్రజల మనోభావాలు.. సెంటిమెంట్‌ను శాంతియుతంగా నిరసన రూపంలో తెలియజేయాలన్నారు. పరిపాలన వికేంద్రీకరణకు మద్దతుగా నాన్ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 15 చేపడుతున్న 'విశాఖ గర్జన'లో పార్టీలకతీతంగా ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మద్దిలపాలెంలోని పార్టీ నగర కార్యాలయంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తో కలిసి విశాఖ గర్జన సన్నాహక సమావేశం నిర్వహించారు. నాన్ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులంతా వలంటీర్లులా పనిచేసి.. తరలివచ్చే ప్రజలకు మంచినీరు, అల్పాహారం తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు.

ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ విశాఖను పరిపాలన రాజధానిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించారని, ఈ నిర్ణయం కార్యరూపం దాల్చాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే వికేంద్రీకరణకు శ్రీకారం చుట్టామని.. అప్పటి నుంచి ప్రతిపక్షాలు అడుగడుగునా అడ్డుపడుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందాలన్నదే తమ ఉద్దేశమన్నారు. శివరామకృష్ణన్ కమిటీ కూడా వికేంద్రీకరణతోనే సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని చెప్పిన విషయం గుర్తు చేశారు. అమరావతి కొంతమందికి మాత్రమే ఉపయోగపడుతుందని.. అక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకునేందుకు అనువుగా మార్చుకున్నారన్నారు. ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధికి అమరావతి వాసులు ఎందుకు అడ్డుపడుతున్నారని ప్రశ్నించారు.

విశాఖ గర్జన జయప్రదం చేయండి

వెనుకబడిన ఉత్తరాంధ్ర భవిష్యత్‌కు ఆరు జిల్లాల్లోని వైఎస్సార్ సీపీ శ్రేణులంతా కదం తొక్కాలని సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీతోపాటు ఇతర పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీలకతీతంగా విశాఖ గర్జనలో పాల్గొని ఉత్తరాంధ్ర ప్రాంత ఆత్మగౌరవాన్ని కాపాడాలన్నారు. తెలుగుదేశం డైరెక్షన్‌లో రైతుల ముసుగులో చేపడుతున్న పాదయాత్ర.. విశాఖ గర్జనతో వెనుదిరగాలన్నారు. ఈ నెల 15న ఉదయం 9 గంటలకు ఎల్ఐసీ బిల్డింగ్ వద్ద గల డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం వద్దకు పార్టీ శ్రేణులంతా చేరుకోవాలని సూచించారు. విశాఖగర్జన సుమారు మూడున్నర కిలోమీటర్ల మేర నాలుగు గంటల పాటు పాదయాత్రగా సాగుతుందన్నారు. మార్గమధ్యలో ఎవరికీ ఎటువంటి ఇబ్బంది కలగకుండా వార్డు ఇన్‌చార్జిలు, కార్పొరేటర్లు తగిన చర్యలు తీసుకోవాలని సుబ్బారెడ్డి సూచించారు. ఉత్తరాంధ్ర వెనుకబాటుతనాన్ని గుర్తు చేస్తూ వివిధ సాంస్కృతిక కళారూపాల్లో కళాకారుల ప్రదర్శనలుంటాయని వెల్లడించారు. మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతీ కార్యకర్త ఈ గర్జనలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మన ప్రాంత భవిష్యత్ కోసం విశాఖ గర్జన నిర్వహిస్తున్న మేధావులు, నాన్ పొలిటికల్ జేఏసీకి పార్టీ తరఫున పూర్తి సహకారం అందిస్తామన్నారు. సమావేశంలో అనకాపల్లి ఎంపీ సత్యవతి,మాజీ మంత్రి బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

విశాఖలో సాగేదిలా..

సాక్షి,విశాఖపట్నం: నాన్ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 15న చేపడుతున్న 'విశాఖ గర్జన'ర్యాలీ ఎల్ఐసీ బిల్డింగ్ వద్ద గల డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం నుంచి బీచ్‌రోడ్డులోని వైఎస్సార్ విగ్రహం వరకు సాగుతుంది. ఆ రోజు ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే గర్జనలో ముందుగా డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఉత్తరాంధ్ర జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ లజపతిరాయ్ ఆధ్వర్యంలో సభ్యులు, ఉత్తరాంధ్ర ప్రజాప్రతినిధులు, మేధావులు నివాళులర్పిస్తారు. తర్వాత వికేంద్రీకరణతో జరిగే మేలును తెలియజేస్తూ జేఏసీ చైర్మన్ ప్రసంగిస్తారు. అనంతరం ర్యాలీ ప్రారంభమవుతుంది. జైలురోడ్డు జంక్షన్ మీదుగా సెవెన్ హిల్స్ ఆస్పత్రి జంక్షన్, వాల్తేర్ క్లబ్, సిరిపురం జంక్షన్, చినవాల్తేర్ జంక్షన్ మీదుగా సుమారుగా మూడున్నర కిలోమీటర్ల మేర పాదయాత్రగా ర్యాలీ సాగుతుంది. బీచ్‌రోడ్డులోని ద పార్క్ హోటల్ జంక్షన్‌లోని వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించి.. అక్కడ ఉత్తరాంధ్ర జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ) చైర్మన్‌తో పాటు ప్రభుత్వం నుంచి ఒకరు మాట్లాడతారు. ర్యాలీ ప్రారంభం నుంచి చివరి వరకు ఉత్తరాంధ్ర వెనుకబాటుతనం.. ఇక్కడ ప్రజలు పొట్టకూటి కోసం ఇతర ప్రాంతాలకు ఎలా వలసలు వెళ్లిపోతున్నారో వివరిస్తూ సాంస్కృతిక ప్రదర్శనలు సాగనున్నాయి.

మెనూ అమలులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు





పాడేరు, అరకులోయల్లో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి



డుంబ్రిగుడలో విద్యార్థుల సమస్యలను తెలుసుకుంటున్న ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్ రెడ్డి

• రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి

సాక్షి,పాడేరు/డుంబ్రిగుడ/అరకులోయ/హుకుంపేట: వసతి గృహాల్లో మెనూ అమలులో ఎటువంటి నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి హెచ్చరించారు. పాడే రు,డుంబ్రిగుడ, అరకులోయ, హుకుంపేట మండలాల్లో గురువారం ఆయన పర్యటించారు. పాడేరు లోని లోచలిపుట్టు, శ్రీకృష్ణాపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు,డుంబ్రిగుడలో గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలను, అరకులోయలో కంఠభంసుగుడ బాలురు, బాలికల ఆశ్రమపాఠశాలలు, ఉన్నత పాఠశా ల, యండపల్లివలస గురుకులం, కస్తూర్బాగాంధీ విద్యాలయం , హుకుంపేట మండలం పెదగరువు బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించి, విద్యార్థుల సమస్యలు తెలుసుకున్నారు. డుంబ్రిగుడ పాఠశాలలో స్టాక్ రూమ్‌లో గుడ్లను పరిశీలించి, ఒక్కో గుడ్డు ఎన్ని గ్రాములు ఉండాలని డిప్యూటీ మేట్రిన్‌ను ప్రశ్నించారు. ఆయన చెప్పలేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. 40 నుంచి 50 గ్రాముల బరువు ఉండాలని, అన్ని గుడ్లూ ఒకేలా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన హాస్టళ్లకు కూడా పోర్టిఫైడ్ బియ్యం పంపిణీకి చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో రెండు రోజుల్లో ఇరవై ఆరు ప్రభుత్వ విద్యాలయాలు,అంగన్‌వాడీలు,పలు విభాగాలను తనిఖీ చేసినట్టు చెప్పారు. ఆహారం విషయంలో ఎక్కడ తప్పు జరిగినా 9490551117 అనే నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. పలు పాఠశాల్లో విద్యార్థులతో పాటు భోజనం చేశారు. పద్మాపురం పంచాయతీ కేంద్రంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిచారు. గత్తరగుడ గ్రామంలో పర్యటించి రేషన్ కార్డుదారులతో మాట్లాడారు. గిరిజన సంక్షేమ డీడీ కొండలరావు,జీసీసీ డీఎం పార్వతమ్మ,ఏటీడబ్ల్యూవో ఎల్.రజనీ.ఎంఈవో సరస్వతి,పౌరసరఫరాల శాఖ అధికారులు శివప్రసాద్,వేణుగోపాల్,శ్రీహరి తహసీల్దార్ వేణుగోపాల్, ఎంఈవోలు భారతీరత్నం, త్రినాథరావు, రామచంద్రరావు, జీసీసీ బ్రాంచి మేనేజర్ వెంకటేశ్వర్లు,డిప్యూటీ తహసీల్దార్ ముజీబ్, జీసీసీ పాడేరు,చింతపల్లి డీఎంలు పార్వతి,సింహాచలం , హుకుంపేట ఏటీడబ్ల్యూవో రజిని జెడ్పీటీసీ సభ్యురాలు రోషిణి,ఎంపీటీసీ సభ్యుడు ఆనంద్‌కుమార్,మేనేజర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

జీసీసీ గొడౌన్‌లో ముక్కిన 9వేల కిలోల కందిపప్పు

• సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఫుడ్ కమిషన్ చైర్మన్



అరకులోయ జీసీసీ గొడౌన్‌లో కంది పప్పును పరిశీలిస్తున్న ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్ రెడ్డి, ఇతర అధికారులు

అరకులోయ రూరల్: స్థానిక జీసీసీ గొడౌన్‌లో 180 బస్తాల్లో తొమ్మిదివేల కిలోల ముక్కిన కంది పప్పు ఉండడంపై రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన గురువారం జీసీసీ గొడౌన్‌ను పరిశీలించారు. గొడౌన్‌లో కాలం చెల్లిన కందిపప్పు ఉండడాన్ని గమనించారు. నాలుగు నెలల కిందటే డిపోలకు సరఫరా చేయవలసి ఉండగా ఎందుకు అందజేయలేదని ప్రశ్నించారు. దీనిపై విచారణ జరిపి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వారం రోజుల కిందట ఈ కందిపప్పును సివిల్‌సప్లై అధికారులు సరఫరా చేసినట్టు జీసీసీ బ్రాంచి మేనేజర్ వెంకట్ తెలిపారు. ఫుడ్ కమిషన్ చైర్మన్‌తోపాటు పరిశీలనకు వచ్చిన జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి వేణుగోపాల్ ఆ కందిపప్పును సీజ్ చేశారు. సంబంధిత అధికారులపై కేసు నమోదు చేస్తామని చెప్పారు.

బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించాలి : జేసీ



రాజకీయ పార్టీల నేతలతో మాట్లాడుతున్న జేసీ శివశ్రీనివాసు

సాక్షి, పాడేరు: రానున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అన్ని రాజకీయ పార్టీల నేతలు బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకోవాలని జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్ సూచించారు. కలెక్టరేట్‌లో పలు రాజకీయ పార్టీల నేతలతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని పోలింగ్ బూత్‌ల మార్పులు, చేర్పులపై లిఖితపూర్వక నివేదికలు ఇవ్వాలన్నారు. ఓటర్ల జాబితా తయారీలో సహకరించాలని ఆయన కోరారు. నవంబర్ 11వ తేదీ వరకు ఫారం 18ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. నవంబర్ 18న డ్రాఫ్ట్ పబ్లికేషన్ ఉంటుందని, 23వ తేదీ నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తామని, డిసెంబర్ 25నాటికి వాటిని పరిష్కరించి, 30వతేదీన తుది జాబితాను ప్రకటిస్తామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల నేతల నుంచి సలహాలు,సూచనలు స్వీకరించారు.ఈ సమావేశంలో డీఆర్‌వో దయానిధి, తహసీల్దార్ త్రినాథరావు నాయుడు, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, మాజీ ఎంపీపీ మంగ్లన్నదొర, బీజేపీ నేత పాంగి రాజారావు, సీపీఎం నాయకుడు పాంగి లక్కు, కాంగ్రెస్ నేత నాగరాజు, పర్యవేక్షకులు నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డోలీలో రోగి తరలింపు



రోగిని డోలీలో మోసుకొని వస్తున్న గిరిజనులు

అనంతగిరి: మండలంలోని మారుమూల పినకోట పంచాయతీ రాచకీలం గ్రామానికి చెందిన తామర్ల రాజబాబు కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో వాహనాలు వచ్చే పరిస్థితి లేదు. అతని పరిస్థితి విషమంగా ఉండడంతో గ్రామస్తులు సహకారంతో 12 కిలో మీటర్లు డోలీలో మోసుకుని చింతపాక గ్రామానికి చేరుకున్నారు. అక్కడ నుంచి ఆటోలోని దేవరాపల్లి ఆస్పత్రికి తరలించినట్లుగా కుటుంబ సభ్యులు తెలిపారు. ఇదే గ్రామంలోని గత కొద్దిరోజుల క్రితం సురుగు రాజులమ్మ అనారోగ్యానికి గురైతే ఆమె డోలీలో తరలించినట్లుగా గిరిజనులు తెలిపారు. అధికారులు స్పందించి రహదారి సౌకర్యం కల్పించాలని వారు కోరుతున్నారు.

పంచాయతీ నిధుల దారి మళ్లింపు అవాస్తవం

- ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర



సర్పంచ్‌ల సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

ముంచంగిపుట్టు: గ్రామ పంచాయతీ నిధులు ప్రభుత్వం దారి మళ్లించిదని జరుగుతున్న ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని ఉమ్మడి విశాఖ జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. మండల కేంద్రంలో గురువారం సర్పంచ్‌లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర చరిత్రలో రాజకీయ నాయకులు ప్రమేయం లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత జగనన్నదని అన్నారు. రాష్ట్రాలకు కేటాయించిన నిధులను ఏ ప్రభుత్వం వెంటనే పంచాయతీలకు కేటాయించిందో ప్రతిపక్షాలు చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పాలనను చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు 14,15 ఆర్థిక సంఘం నిధులపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆమె అన్నారు. పంచాయతీ నిధులు ఫైల్ డీఎల్పీవో స్థాయిలో ఉందని, నిధుల సర్దుబాటులో ఆలస్యమైందన్నారు. ఇప్పుడు పంచాయతీల ఖాతాలకు జమచేసిన విషయాన్ని ప్రతిపక్ష నేతలు గమనించాలని ఆమె సూచించారు. సచివాలయ వ్యవస్థను జగనన్న ఏర్పాటు చేసి గడప గడప కార్యక్రమం ద్వారా రూ.20లక్షల చొప్పున ప్రతి సచివాలయానికి కేటాయిస్తూ గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ప్రతీ విషయం ప్రజలు గమనిస్తున్నారని ప్రతిపక్షం మాత్రం ఎప్పుడూ బురదజల్లే పనిలోనే ఉందని ఆమె విమర్శించారు. అనంతరం పంచాయతీల వారీగా సమస్యలను సర్పంచ్‌లు చైర్‌పర్సన్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడర వి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో టీడీపీ నేతల చేరిక



టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

పెదబయలు: మండలంలోని లక్ష్మీపేట పంచాయతీ కేంద్రంలో గురువారం టీడీపీ నుంచి 48 కటుంబాలు వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ సమక్షంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు కాకరి అప్పన్నతోపాటు 48 కుటుంబాలకు చెందిన వారికి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, జగనన్న సంక్షేమ పాలన చూసి పార్టీలో చేరామని టీడీపీ నేతలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ జగనన్న పాలనకు ఆకర్షితులై, టీడీపీ నేత చంద్రబాబు కుటిల రాజకీయాలు చూడలేక చేరికలు పెరుగుతున్నాయన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి సూర్యనారాయణ, రాష్ట్ర అగ్రో డైరెక్టర్ సన్యాసి, పార్టీ మండలాధ్యక్షుడు ఆనందరావు పాల్గొన్నారు.

కారులో గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు



గంజాయి నిందితులతో పోలీసులు

మోతుగూడెం : చింతూరు మండలం లక్కవరం జంక్షన్ వద్ద అక్రమంగా వాహనంలో గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను గురువారం అరెస్టు చేసినట్టు మోతుగూడెం ఎస్‌ఐ వి.సత్తిబాబు తెలిపారు. లక్కవరం జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా మోతుగూడెం వైపు నుంచి వస్తున్న వాహనం ఆపి తనిఖీ చేయగా 25 కేజీలు లభ్యమైందన్నారు. తెలంగాణ రాష్ట్రం నకిరేకల్‌కు తరలిస్తున్నారని తెలిపారు. ఈ కేసులో పి.రామకృష్ణ, గుండాల విజయకుమార్ అనే ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు తెలిపారు. అల్లూరికోటకు చెందిన మరో నిందితుడు పరారీలో ఉన్నట్టు తెలిపారు. తనిఖీలో ఏఎస్‌ఐ పట్టాభిరామయ్య, హెడ్‌కానిస్టేబుల్ రవిచంద్ర, సోమరాజు, శివప్రసాద్, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు. నిందితుల వద్ద నుంచి రూ.75వేలు నగదు, రెండు మొబైల్ ఫోన్లు, ఆధార్ కార్డు జెరాక్స్‌లు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

ఐక్య ఉద్యమాలు చేపట్టాలి

చింతూరు: కేంద్ర ప్రభుత్వ పెట్టుబడిదారీ విధానాలపై విశాల ఐక్య ఉద్యమాలు చేపట్టాలని సీఐటీయూ అఖిలభారత ఉపాధ్యక్షురాలు బేబీరాణి పిలుపునిచ్చారు. గురువారం చింతూరులో జరిగిన సీఐటీయూ జిల్లా ప్రథమ మహాసభలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ స్వచ్ఛభారత్ పేరుతో రూ.కోట్లలో ప్రజాధనం దోపిడీ జరిగిందన్నారు. పెట్రోల్, డీజిల్‌పై జీఎస్టీ లేకుండా సామాన్య వస్తువులపై కేంద్రం జీఎస్టీ భారం మోపిందని ఆమె విమర్శించారు. ఈ కార్యక్రమంలో పూనెం సత్యనారాయణ, కొమరం పెంటయ్య, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, మట్ల శ్రీవాణి, నిర్మల, ఎస్ఎస్ మూర్తి, వెంకటరమణ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

సీఐటీయూ నూతన కమిటీ ఎన్నిక

సీఐటీయూ జిల్లా నూతన కమిటీ ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షురాలిగా మట్ల శ్రీవాణి, కార్యదర్శిగా పల్లపు వెంకట్‌తో పాటు తొమ్మిది మందితో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అపరిశుభ్రంగా పాఠశాల ఆవరణ

- మెరుగుపరిచే వరకు పిల్లలను పంపించం
- ఇళ్లకు తీసుకువెళ్లిన సరంపేట గ్రామస్తులు



పాఠశాల పరిస్థితిపై టీచర్‌కు వినతిపత్రం ఇస్తున్న సరంపేట గ్రామస్తులు

అడ్డతీగల : పాఠశాల ఆవరణలో అపరిశుభ్రత పరిస్థితులను నివారిస్తేనే తమ పిల్లలను పాఠశాలకు పంపిస్తామని మండలంలోని సరంపేట గ్రామస్తులు గురువారం స్పష్టం చేశారు. ఈ విషయాన్ని పాఠశాల ఉపాధ్యాయులకు వినతిపత్రం ద్వారా తెలియజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కొన్నాళ్లుగా పాఠశాల వద్ద అపరిశుభ్రత నెలకొనడంతో తామే శుభ్రం చేసేవారమని వివరించారు. అయినప్పటికీ పశువుల సంచారంతో పరిస్థితి అధ్వానంగా మారుతోందని వారు తెలిపారు. దీనివల్ల అనారోగ్య పరిస్థితులు నెలకొన్నాయని, పాఠశాల చుట్టూ రక్షణ కంచె ఏర్పాటుచేద్దామంటే అధికారులు స్థలం హద్దులు చూపడం లేదన్నారు. నాడు-నేడులో నిధులు మంజూరైనా అభివృద్ధి పనులు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అపరిశుభ్ర వాతావరణాన్ని మెరుగుపరచడమే కాకుండా అభివృద్ధి పనులు చేపట్టే వరకు తమ పిల్లలను పాఠశాలకు పంపించమని వారు ఉపాధ్యాయులకు స్పష్టం చేశారు. అంతవరకు పాఠశాలను మూసివేయాలని సూచించారు. అనంతరం తమ పిల్లలను ఇళ్లకు తీసుకుపోయారు. ఈ విషయాన్ని ఉపాధ్యాయులు విద్యాశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



పోటీలను ప్రారంభిస్తున్న క్రీడా పాఠశాల ప్రిన్సిపాల్ మూర్తి

అరకులోయ రూరల్: రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేసినట్టు క్రీడా పాఠశాల ప్రిన్సిపాల్ పీఎస్ఎన్ మూర్తి తెలిపారు. గురువారం స్థానిక క్రీడా పాఠశాల మైదానంలో నిర్వహించారు. 42వ ఎస్జీఎఫ్ రాష్ట్ర స్థాయి జూనియర్ విభాగంలో ఆర్చరీ పోటీల్లో 35 మంది పాల్గొన్నారు. వీరిలో ఇండియన్ రౌండ్‌లో కుమార్‌నాయుడు, దేవరాజు, ప్రశాంత్, నరేంద్రనాయక్, వినయ్, కాంపౌండ్ రౌండ్‌లో గణేష్‌మణికంఠ, యశ్వంత్, హర్షవర్ధన్, సహిత్, అశోక్‌కుమార్ ఎన్నికయ్యారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఇండియన్ రౌండ్ బాలికల విభాగంలో జని, సువర్ణ, మోతి, కవితారాణి, షణ్ముఖి, కావ్య ఎంపికయ్యారని ఆయన పేర్కొన్నారు. పోటీల్లో పీఈటీలు సూరిబాబు, సుధాకర్ నాయుడు, ప్రసాద్, కుమారి పాల్గొన్నారు.

అదుపు తప్పి ఆటో బోల్తా



జాతీయ రహదారిపై బోల్తాపడిన ఆటో

ఎటపాక : మండలంలోని నెల్లిపాక వద్ద జాతీయ రహదారిపై ఓ ఆటో అదుపుతప్పి బోల్తా పడిన ఘటన గురువారం జరిగింది. నెల్లిపాక నుంచి భద్రాచలం వెళుతున్న ఆటో జాతీయ రహదారిపై ఉన్న బ్రిడ్జి వద్ద అదుపుతప్పింది. ఆ సమయంలో ఆటో రహదారి పక్కకు దూసుకెళ్లి ఇరవై అడుగుల లోతులోకి పల్టీలు కొట్టి పడిపోయింది. ఈ ప్రమాదంలో లక్ష్మీపురం గ్రామానికి చెందిన ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు.

తప్పిపోయిన విద్యార్థులు
పాఠశాల సిబ్బందికి అప్పగింత



తప్పిపోయిన ముగ్గురు విద్యార్థులను ప్రిన్సిపాల్‌కు అప్పగిస్తున్న ఎస్‌ఐ అప్పలరాజు

అడ్డతీగల : అడ్డతీగల గురుకుల పాఠశాలలో ఐదో తరగతి చదువుకుంటూ గురువారం ఉదయం తప్పిపోయిన ముగ్గురు విద్యార్థులను పోలీసులు తిరిగి పాఠశాల సిబ్బందికి అప్పగించారు. అడ్డతీగల మండలం మారుమూల గ్రామమైన డి.పోలవరం గ్రామానికి చెందిన యోహాన్, దాసు, మోజెస్ అడ్డతీగల గురుకుల పాఠశాలలో ఐదో తరగతి చదువుకుంటున్నారు. దసరా సెలవులు అనంతరం వీరిని తల్లిదండ్రులు మంగళవారం పాఠశాలలో అప్పగించారు. అయితే గురువారం అల్పాహారం తీసుకున్న అనంతరం రహస్యంగా పాఠశాల నుంచి బయటకు వచ్చేశారు. పాఠశాలలో భోజన సమయంలో విద్యార్థులు కనిపించని విషయం గుర్తించిన పాఠశాల ప్రిన్సిపాల్ కె.వి.హరినాథరావు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పాఠశాల సిబ్బందితో పాటు పోలీసులు విద్యార్థుల ఆచూకీ కోసం వెతకడం ప్రారంభించారు. ఈలోగా అడ్డతీగల మండలం వేటమామిడి పరిసర ప్రాంతంలో వై.రామవరం రోడ్‌పై కాలినడకన వెళ్తున్న విద్యార్థులను అడ్డతీగల వెటర్నరీ అసిస్టెంట్లు కొందరు సచివాలయ సిబ్బంది గుర్తించి వారిని ఆపి ఎక్కడికి వెళ్లాలి? ఎవరు మీరు అని ప్రశ్నించడంతో మా ఊరుకి వెళ్తున్నామని బెంగతో ఇలా చేశామని చెప్పి చేతిలో డబ్బులు లేకపోవడంతో ఇలా నడుచుకుంటూ సొంతూరుకి వెళ్తున్నామని సమాధానం ఇచ్చారు. దీంతో అడ్డతీగల పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వారిని స్టేషన్‌కి తరలించి ప్రిన్సిపాల్ హరినాథరావుకి ముగ్గురు విద్యార్థులను ఎస్‌ఐ అప్పలరాజు అప్పగించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఐటీడీఏ పీవో రామశేషుకు వినతి పత్రం ఇస్తున్న ఎంపీపీ తదితరులు

కూనవరం: వరదల అనంతరం అధ్వానంగా మారిన రహదారులకు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ ఎంపీపీ పాయం రంగమ్మ ,సర్పంచులు కారం పార్వతి, సున్నం అభిరామ్, కట్టం లక్ష్మిలు గురువారం చింతూరు ఐటీడీఏ పీవో రామశేషుకు వినతి పత్రం అందచేశారు. నాలుగు దఫాలుగు వచ్చిన గోదావరి వరదలకు కోండ్రాజ్ పేట -టేకులబోరులా మధ్య రహదారి అధ్వానంగా మారిందన్నారు. పోలవరం పరిహారం పొందిన భూముల్లో మినహాయించిన 6.25 ఎకరాల్లో కొత్త చట్టం ప్రకారం రెండున్నర ఎకరాలు పోనూ మిగిలిన దానికి నగదు చెల్లించాలని కోరారు. దీనిపై పీవో సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. పోలవరం భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్టు వారు వివరించారు.

మోతుగూడెంలో కలప స్వాధీనం



స్వాధీనం చేసుకున్న కలపతో డీఎఫ్‌వో, అటవీ సిబ్బంది

మోతుగూడెం: చింతూరు మండలం మోతుగూడెంలో గురువారం దాడులు నిర్వహించి అక్రమంగా ఉంచిన కలపను స్వాధీనం చేసుకున్నట్టు డీఎఫ్‌వో సాయిబాబా తెలిపారు. వివిధ సైజుల్లో ఉన్న 51 జిట్రేగు, 60 టేకు దుంగలనుస్వాధీనం చేసుకున్నామని, 2.5 సీఎంటీలు కలిగిన ఈ కలప విలువ రూ. 1.80 లక్షలు ఉంటుందని ఆయన చెప్పారు. కలప అక్రమ రవాణాకు పాల్పడిన, అక్రమంగా ఉంచిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఉప్పొంగిన వాగులు



హుకుంపేట-పాడేరు మండలాల సరిహద్దులోని రాళ్లగెడ్డలో వరద ప్రవాహం



మదేరు ఆనకట్ట వద్ద పొంగిన వరద నీరు



గొట్లుపాడు కాలువలో చిక్కుకున్న లారీని బయటకు తీస్తున్న కలాసీలు

సాక్షి,పాడేరు/రాజవొమ్మంగి: ఏజెన్సీలో విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా వాగులు, గెడ్డలు పొంగిప్రవహిస్తున్నాయి. రాజవొమ్మంగి మండలంలోని కింద్ర, కిర్రాబు, శరభవరం, బోయపాడు తదితర గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. దీంతో పాటు ఎగువన కురిసిన వర్షాలు తోడు కావడంతో లబ్బర్తి వద్ద చిన్నేరు, పెద్దేరు, శరభవరం కొండ వాగులకు వరద పోటెత్తింది. రెండు గంటల పాటు ఈ ప్రాంతంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చిన్నేరు, పెద్దేరు వాగుల నుంచి వరద నీరు జడ్డంగిలో గల మదేరు ఆనకట్టకు చేరడంతో అక్కడ నీరు పొంగి ప్రవహిస్తోంది. వర్షాలతో వారపు సంతలకు ఆటంకం ఏర్పడుతోంది.

కాలువలో చిక్కుకున్న జీసీసీ లారీ

కొయ్యూరు మండలం యూ.చీడిపాలెం డీఆర్ డిపోకు,అక్కడ ఆశ్రమ పాఠశాలకు బియ్యం తీసుకెళ్లి, తిరిగి వస్తున్న జీసీసీ లారీ గురువారం గొట్లుపాడు కాలువలో చిక్కుకుపోయింది.దీంతో శ్రమకోర్చి జీసీసీ కలాసీలు లారీ బయటకు తీశారు. జిల్లా వ్యాప్తంగా 228.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వై.రామవరంలో 42.2, హుకుంపేటలో 35.2, అరకులోయలో 28.6, జి.కె.వీధిలో 24, పెదబయలు 16.4, జి.మాడుగులలో 16.4, అనంతగిరిలో 14.2, డుంబ్రిగుడలో 9.2, ఎటపాకలో 8.2, ముంచంగిపుట్టులో 7.8, చింతపల్లిలో 7.6, గంగవరంలో 5.8, రాజవొమ్మంగిలో 4.8, పాడేరులో 3.4, మారేడుమిల్లిలో 2.4, చింతూరులో 2.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు పాడేరు కలెక్టరేట్ అధికారులు తెలిపారు.

పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు



ఎటపాకలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్న అధ్యాపకులు

ఎటపాక: ఎటపాక ఆదర్శ ఆశ్రమ పాలిటెక్నిక్ కళాశాల గురువారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించారు. సివిల్,మెకానికల్,ఎలక్ట్రికల్ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించారు. మూడు కోర్సుల్లో చేరేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థుల ధ్రువపత్రాలను ప్రిన్సిపాల్ జె రామసత్యనారాయణ పరిశీలించారు. ఈఏడాది కోఎడ్యుకేషన్‌కు గాను బాలికలకు కూడా అవకాశం కల్పించారు.మొత్తం 27 మంది విద్యార్థులు స్పాట్ అడ్మిషన్లకు హాజరైనట్టు ప్రిన్సిపాల్ తెలిపారు.

ఆక్రమణల తొలగింపు



ఆక్రమణల తొలగింపును పర్యవేక్షిస్తున్న అధికారులు

చింతూరు: స్థానిక మెయిన్‌రోడ్‌లోని దుకాణాలకు సంబంధించిన ఆక్రమణలను అధికారులు గురువారం తొలగించారు. తహసీల్దార్ సాయికృష్ణ, ఎంపీడీవో రవిబాబు, ఎస్‌ఐ యాదగిరి, కార్యదర్శి ప్రసాదరావు ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఆక్రమణల తొలగింపును పర్యవేక్షించారు. మెయిన్‌రోడ్‌లో డ్రైనేజీలను ఆక్రమించి నిర్మించిన షెడ్లను అధికారులు దగ్గరుండి తొలగించారు. ఇకపై డ్రైనేజీని ఆక్రమించి ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా, సరకులను డ్రైనేజీ దాటి పెట్టినా కఠినచర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

పిడుగుపాటుకు దెబ్బతిన్న పరికరాలు

కొయ్యూరు: మండలంలో రెండు రోజుల క్రితం సింగవరంలో పిడుగుపాటుకు ఏపీజీవీ బ్యాంకు పరికరాలు దెబ్బతిన్నాయి. దీనివల్ల బ్యాంకు సేవలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. పరికరాలు దెబ్బతినడం వల్ల రూ.2 లక్షల వరకు బ్యాంకుకు నష్టం వాటిల్లింది.

అంతేకాకుండా బ్యాంక్ పక్కన ఉన్న జియో టవర్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బతింది. గురువారం నిపుణులు మరమ్మతులు చేపట్టారు.

మన్యంలో సంక్షేమ స్వర్ణయుగం

- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ
- సీకరి పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహణ
- ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే

పెదబయలు: అభివృద్ధి.. సంక్షేమం.. రెండు కళ్లుగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని, మన్యంలో సంక్షేమ స్వర్ణయుగం నడుస్తోందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలో గల సీకరి పంచాయతీ కొరిపల్లి, అరిమెర, సరియాపల్లి, పులుసుమామిడి గ్రామాల్లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గడప గడపకు వెళ్లి పథకాలను వివరించారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. పథకాలు అందుతున్నదీ లేనిదీ తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఆయనకు గిరిజనులు పూలమాలలు వేసి బ్రహ్మరథం పట్టారు. గతంలో పథకాలు పొందేందుకు సమస్యలు ఎదురయ్యేయని, ఇప్పుడు నేరుగా ఇంటికే అందుతున్నాయని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉన్నారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అరకు నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధిపథంలో దూసుకుపోతోందన్నారు. త్వరలో పురుగుడుపుట్టు నుంచి పులుసుమామిడి వరకు తారురోడ్డు నిర్మాణం చేపడతామని చెప్పారు. ప్రతి గ్రామానికి రోడ్డు, తాగునీరు, వైద్యం, విద్య, విద్యుత్ సౌకర్యాలు పూర్తిస్థాయిలో కల్పించామని చెప్పారు. పెదబయలులో హెల్త్‌క్లినిక్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన 187 గడపలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రో డైరెక్టర్ సన్యాసిరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అనందరావు, సర్పంచ్ కృష్ణారావు, పార్టీ నేతలు సూరయ్య, కనకరాజు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


పథకాల అమలు తీరుపై గిరిజనులను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

క్లుప్తంగా

బాబా సన్నిధిలో అన్నసంతర్పణ


అన్న సంతర్పణలో పాల్గొన్న భక్తులు

రాజవొమ్మంగి: స్థానిక షిర్డీసాయి ఆలయంలో గురువారం పురస్కరించుకుని అన్నసంతర్పణ ఏర్పాటుచేశారు. ఇందుకుగాను హైదరాబాద్‌కు చెందిన నవుడూరి శ్రీనివాస్, అనుపమ దంపతులు ఆర్థిక సహకారం అందించారు. ప్లాస్టిక్ కుర్చీలు అందజేశారు. పురోహితుడు భయ్యా భానుమూర్తి గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీగా భక్తులు పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ప్రతి గురువారం నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి విరాళం అందించి సహకరించాలని ఆలయ కమిటీ విజ్ఞప్తి చేసింది.

చిలగడ దుంపల సేకరణలో రైతులు బిజీ


దుంపలు సేకరిస్తున్న గిరిజన రైతులు

డుంబ్రిగుడ: మండలంలోని సొవ్వ మారుమూల పంచాయతీలో గిరి రైతులు చిలగడ దుంపల సేకరణలో నిమగ్నమయ్యారు. వీటిని అరకు వారపు సంతలో విక్రయించేందుకు సిద్ధం చేస్తున్నారు. వీటి ధర 50 కిలోల బస్తా రూ.1500 వరకు ఉందని రైతులు తెలిపారు.

కొయ్యూరులో భారీ వర్షం

- ఉధృతంగా కాలువలు


రేవళ్లు రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షం నీరు

కొయ్యూరు: మండలంలో గురువారం ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. పంట పొలాల్లోకి నీరు చేరింది. కొయ్యూరు, కాకరపాడు, తీగలమెట్ట, పలకజీడి ప్రాంతాల్లో కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. జనజీవనం స్తంభించింది. జీడిమామిడి తోటల్లో తుప్పల తొలగింపు పనులు నిలిచిపోయాయి.

ఈకేవైసీ తప్పనిసరి


సుజనపేటలో ఈకేవైసీ నమోదు చేస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

ముంచంగిపుట్టు: రైతులంతా తప్పనిసరిగా ఈకేవైసీ చేసుకోవాలని సర్పంచ్ వి.రమేష్ అన్నారు. మండలంలోని సుజనకోటలో ఆధ్వర్యంలో వ్యవసాయశాఖ అధికారులు గురువారం ఈకేవైసీ చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట భూములకు రైతుల ఆధార్ కార్డుతో లింక్ చేసుకోవడం వల్ల ప్రభుత్వ పరంగా ప్రయోజనాలు పొందవచ్చన్నారు.

రుణ యాప్‌లకు ఆకర్షితులు కావొద్దు


రుణయాప్‌ల వల్ల అనర్థాలను వివరిస్తున్న ఎస్‌ఐ షరీఫ్

రాజవొమ్మంగి: ఆన్‌లైన్ రుణయాప్‌లకు ఆకర్షితులు కావొద్దు- కష్టాలు కొని తెచ్చుకోవద్దని జడ్డంగి ఎస్‌ఐ షరీఫ్ సూచించారు. బుధవారం రాత్రి ఆయన మండలంలోని కేశవరంలో ఆదివాసీలతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, హెల్మెట్ ధరించాలని సూచించారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమం

- రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి
- లక్కొండ సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహణ
- స్కూటీపై పర్యటించిన ఎమ్మెల్యే


స్కూటీపై పండావారి వీధికి వెళ్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి


దొరమామిడిలో గృహ లబ్ధిదారులకు పట్టా పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి.

గంగవరం : పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల వారికి ప్రభుత్వ పథకాలు అందించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతోందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని లక్కొండ గ్రామసచివాలయం పరిధిలోని దొరమామిడి పంచాయతీ దొరమామిడి, పెదగార్లపాడు, చినగార్లపాడు గ్రామాల్లో ఆమె గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పథకాలు పొందిన లబ్ధిదారులతో మాట్లాడారు. దొరమామిడిలో 108, పెదగార్లపాడులో 98, చినగార్లపాడులో 52 గృహాలను ఆమె సందర్శించారు. ఎంపీపీ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. నాడు-నేడు పథకంలో పాఠశాల భవనం మంజూరుకు చర్యలు తీసుకోవాలని ఎంఈవోకు మల్లేశ్వరరావును ఎమ్మెల్యే సూచించారు. భవనం పరిస్థితి బాగోలేదని పాఠశాలను ఏదైనా అద్దె భవనంలోకి మార్చాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రం భవన రిపేర్లకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఇందుకు తగిన ప్రతిపాదనలు పంపాలని సీడీపీవో లక్ష్మిని ఎమ్మెల్యే ఆదేశించారు. దొరమామిడి గ్రామ పంచాయతీలో సమస్యలు పరిష్కరించాలని సర్పంచ్ చంద్రకళ, ఎంపీటీసీ సభ్యుడు పండా ఆదినారాయణ, దొరసమామిడి గ్రామస్తులు ఎమ్మెల్యేకు వినతి పత్రాలు సమర్పించారు. దొరమామిడి రామాలయం వీధి నుండి పండా వారి వీధి వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులిస్తామని, వీధి రోడ్లు అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ద్విచక్ర వాహనంపై పర్యటించి పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపారు. ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ బేబీరత్నం, వైస్ఎంపీపీ కుంజం గంగాదేవి, ఎంపీటీసీ సభ్యులు కనకలక్ష్మి, పద్మావతి, కోఆప్షన్ సభ్యుడు కేఎస్ ప్రభాకర్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ యెజ్జు వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు రఘునాథ్, వైఎస్సార్ సీపీ అరకు పార్లమెంట్ జిల్లా కార్యదర్శులు సూరంపూడి ఏడుకొండలు, దిండి బాబీ, డిప్యూటీ తహసీల్దార్ పినిశెట్టి రామకృష్ణ, వ్యవసాయాధికారి విశ్వనాథ్, ఏవో సిద్దేశ్వరరావు, సర్పంచ్‌లు లీలావతి, పాతర రమణమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఎండిన చెట్టు


ప్రధాన రహదారిని అనుకొని ఉన్న ఎండిన చెట్టు

అడ్డతీగల: స్థానిక మెయిన్‌రోడ్డులోని అంబేడ్కర్ సెంటర్ వద్ద ఎండిన నిద్రగన్నేరు చెట్టు ప్రమాదభరితంగా మారింది. గురువారం మధ్యాహ్నం పెద్ద కొమ్మ 11 కేవీ విద్యుత్ లైన్లపై పడటంతో మంటలు ఏర్పడి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో పరిసర ప్రాంతీయులు ఆందోళనకు గురయ్యారు. తరచూ ఇలా చెట్టు కొమ్మలు పడుతుండటంతో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికైనా ఎండిన చెట్టును తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు మండల మహిళా సమాఖ్య ఈసీ సమావేశం

రాజవొమ్మంగి : స్థానిక స్త్రీశక్తి భవనంలో శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మండల మహిళా సమాఖ్య ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఏపీఎం ఆదినారాయణ తెలిపారు. ఈ సమావేశంలో సిబ్బంది పనితీరు పరిశీలించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తామని చెప్పారు. సమావేశానికి హాజరయ్యేవారు సమయపాలన పాటించాలన్నారు. అలాగే బ్యాంకు లింకేజీ రుణాలు, స్త్రీనిధి, టీఎస్పీ, సీఐఎఫ్ (ఎంసీపీ అప్పులు), వీవో ఆర్ఎఫ్, హెచ్‌డీఐఎఫ్ తదితర రుణాల రికవరీకు చెందిన పూర్తి సమాచారం తెలపాలన్నారు.

నేడు గడపగడపకు మన ప్రభుత్వం

జి.మాడుగుల: మండలంలో సింగర్బ పంచాయతీ రచ్చపల్లి, ఎం నిట్టాపుట్టు, శంకులమిద్దే, రోలంగిపుట్టు, భారం గ్రామాల్లో శుక్రవారం పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ మండలశాఖ అధ్యక్షుడు కె.సత్యనారాయణ, లువ్వాసింగి ఎంపీటీసీ గబ్బాడి సన్యాసిదొర తెలిపారు. మండలంలోని జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, పీఏసీఎస్, పాడేరు ఏఎంసీ చైర్మన్లు, డైరెక్టర్లు, సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొనాలని వారు కోరారు.

ఈకేవైసీ నమోదు చేసుకోండి

డుంబ్రిగుడ: రైతుల ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని వైఎస్సార్‌సీపీ నేత బాలరాజు సూచించారు. గురువారం ఆయన కొర్రా పంచాయతీ గ్రామాల్లో రైతులు ఈకేవైసీ ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. శుక్రవారం వరకు గడువు ఉందన్నారు.

మట్టిరోడ్డు పనులు ప్రారంభం


రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ తదితరులు

జి.మాడుగుల: మండలంలో కోరాపల్లి పంచాయతీ వయ్యంపల్లి,పసులంక గ్రామాల మట్టి రోడ్ల నిర్మాణాలకు రూ.6 లక్షలు వెచ్చించారు. వీటితో చేపట్టనున్న పనులను గురువారం సర్పంచ్ మసాడి రాజులమ్మ, ఎంపీటీసీ నానాజీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మసాడి పెదబాలన్న, వైస్ సర్పంచ్ విజయకుమారి, ఉపాధి హామీ సిబ్బంది హేమ,అంగనయిని చిట్టినాయుడు పాల్గొన్నారు.

కనీస వేతనం చెల్లించాలి

హుకుంపేట: ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించే వరకు పోరాటం చేస్తామని సీఐటీయు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడల్ అన్నారు. గురువారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన జిల్లా ఆశా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆశా వర్కర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వై.మంగమ్మ, ప్రతినిధులు దాసమ్మ, ధనలక్ష్మి, పార్వతీ, సీపీఎం ప్రతినిధి హైమావతి పాల్గొన్నారు.

పంట కాలువ నిర్మాణానికి స్థల పరిశీలన


కర్నికలంకలో స్థల పరిశీలన చేస్తున్న అధికారులు, రైతులు

జి.మాడుగుల: మండలంలో సింగర్బ పంచాయతీ కర్నికలంక గ్రామంలో చెక్‌డ్యామ్‌కు సంబంధించి పంట కాలువ నిర్మాణానికి పాడేరు ఎస్ఎంఐ డీఈ గురువారం స్థల పరిశీలన చేశారు. ఇటీవల సింగర్బ సచివాలయం పరిధిలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి దృష్టికి రైతులు పంటకాలువ సమస్యను తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన ఆమె పంట కాలువ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు స్థల పరిశీలన చేపట్టారని వైఎస్సార్‌సీపీ నేత పి.రామకృష్ణ తెలిపారు. రైతులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

శ్రమదానంతో రహదారికి మరమ్మతులు


రహదారికి మరమ్మతులు చేపడుతున్న గిరిజనులు

అరకులోయ రూరల్: మండలంలోని మాదల పంచాయతీ దోమలుజోరు, రత్తకండి గ్రామాల రహదారులకు శ్రమదానంతో మరమ్మతులు చేపట్టినట్టు గ్రామస్తులు అప్పన్న, గోపాల్ తెలిపారు. వారిని పలువురు అభినందించారు.

పిల్లల రక్షణకు కమిటీ ఏర్పాటు

హుకుంపేట: చిన్నపిల్లల రక్షణ కొరకు పంచాయతీ స్థాయి చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ ఏర్పాటు చేసినట్టు సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ తెలిపారు. కమిటీ చైర్‌పర్సన్‌గా సర్పంచ్ సమిడ వెంకట పూర్ణిమ, కన్వీనర్‌గా అంగన్‌వాడీ టీచర్ కృష్ణకుమారి, సభ్యులు వీఆర్వో కొండబాబు, కార్యదర్శి త్రినాథ్, మహిళా పోలీసు జయంతి నియమితులయ్యారు.

ఎట్టకేలకు పూడిక సమస్య పరిష్కారం


దుర్గానగర్‌లో డ్రైనేజీల్లో పూడికను తొలగిస్తున్న ఉపాధి వేతనదారులు

రాజవొమ్మంగి: మండలంలోని చికిలింత పంచాయతీ దుర్గానగర్‌లోని డ్రైనేజీల్లో పూడిక తొలగింపును ఉపాధి హామీ పథకంలో చేపట్టారు. పూడిక కారణంగా ఎదుర్కొంటున్న సమస్యలను గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించిన రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి దృష్టికి గ్రామస్తులు తీసుకువెళ్లారు. పూడిక తొలగింపునకు వెంటనే చర్యలు చేపట్టాలని ఆమె అధికారులను ఆదేశించారు. ఈ మేరకు పనులు ప్రారంభవడంతో స్థానికులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

సదుపాయాల కల్పనకు కృషి


మాట్లాడుతున్న ఎంపీపీ కూడా రాజుబాబు, చిత్రంలో జెడ్పీటీసీ రేగం మత్యలింగం

హుకుంపేట: మండలంలోని 33 పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో మౌలిక సదుపాయల కల్పనకు కృషి చేస్తున్నామని ఎంపీపీ కూడా రాజుబాబు, జెడ్పీటీసీ రేగం మత్స్యలింగం తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలసమావేశంలో వారు మాట్లాడారు. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా గ్రామసచివాలయ పరిధిలో మంజూరైన రూ.20 లక్షలతో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు, జలజీవన్ మిషన్ పథకాలపై చర్చించారు.